క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ



పలుకు విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సూర్యవరుణ్‌బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోటలోని పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రౌతు సూర్య వరుణ్ బాబు కేక్ కట్ చేసి పిల్లలకు అవసరమైన నోట్ పుస్తకాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ చైర్మన్ పెదిరెడ్ల శ్రీనివాస్, నీలం గణపతి రావు, రఘుపతి సాయిబాబా, సోము సాయి వినయ్ కుమార్, సోము గౌతమ్, సంస్థ నిర్వాహకురాలు ఘంటా కనకదుర్గ పాల్గొన్నారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

ధవళేశ్వరం: స్థానిక కాటన్ బ్యారేజీ దిగువన స్నానానికి దిగి ఎర్రకొండ ప్రాంతానికి చెందిన కలగా దుర్గాప్రసాద్ (19) గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళితే.. దుర్గాప్రసాద్ ఆదివారం సాయంత్రం మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బ్యారేజీ దిగువ స్నానానికి దిగాడు. అక్కడ స్నానం చేస్తూ మునిగిపోయాడు. అతడిని రక్షించడానికి స్నేహితులు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం రాత్రి గాలించారు. చీకటిగా ఉండడంతో సోమవారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపట్టనున్నారు. ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. సారంగధరమెట్ట ప్రాంతానికి డ్రైవర్ జాన్‌పట్నాక్ (45) ఒంటరిగా నివసిస్తున్నాడు. గొడవల నేపథ్యంలో ఏడాది క్రితం అతడి భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి పట్నాక్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాజమహేంద్రవరం సిటీ: నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా చైతన్య సంస్థ గురువు ఎస్.శివ శంకరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జాంపేటలోని ఉమా రామలింగేశ్వర కల్యాణ మంటపంలో యోగాశిక్షణ నిర్వహించారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో యోగా చైతన్య సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్‌బీఐ రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ మాధురీబాల, సీనియర్ గైనకాలజిస్టు వాసిరెడ్డి బిందు శ్రీదేవి, అమరావతి సర్కిల్ డీజీఎస్ బి.పాపారావు, ఏజీఎస్ జేఎస్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ట్రెజరర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న జక్కంపూడి గణేష్

మధురపూడి: కోరుకొండ గ్రామ దేవత అంకాలమ్మ జాతర ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా వడ్డన చేశారు.

అఖిలకు 1,970 ర్యాంకు



రాజమహేంద్రవరం రూరల్ : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మండలంలోని హుకుంపేటకు చెందిన ఆకెళ్ల అఖిల 1,970 ర్యాంకు సాధించింది. ఆమె తల్లి నాగమణి టీచర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి ఏవీఎస్ఎన్ మూర్తి రైల్వేలో చీఫ్ లోకో పైలట్. కంప్యూటర్ ఇంజినీర్‌గా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని అఖిల తెలిపింది.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి

ప్రకాశం నగర్: ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని అఖిల పక్ష నాయకులు తీర్మానించారు. ఆదివారం స్థానిక ఆనం రోటరీ హాలులో సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, కాంగ్రెస్ నాయకుడు మురళీధర్, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఓ.జోజి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు, ట్రూఆప్ చార్జీలను ఉపసంహరించాలన్నారు. సమావేశానికి సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు మధు, అరుణ్ అధ్యక్షత వహించారు.

టీటీలో మేటిగా..

- సత్తాచాటుతున్న యువక్రీడాకారులు
- జాతీయ పోటీలకు ఎంపిక



విశాఖలో జరిగిన 2023 ప్రీమియర్ లీగ్‌లో ట్రోఫీని అందుకున్న ప్రభాత్ సాయి తదితరులు



చెన్నై టోర్నమెంట్‌లో విజయం సాధించిన చార్వి ఫల్గుణి, గిడుతూరి సిరి పావని, తాన్యశ్రీ

ప్రకాశం నగర్: టేబుల్ టెన్నిస్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. ఆటలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు సాధిస్తున్నారు. జాతీయ స్థాయిలో సత్తా చూపించేందుకు సన్నద్ధమవుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టేబుల్ టెన్నిస్ జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో బాలురు విభాగంలో టి.ప్రభాత్ సాయి, బాలికల విభాగంలో చార్వి ఫల్గుణి, గిడుతూరి సిరి పావని, గిడుతూరి తాన్యశ్రీ, వైష్ణవి సూర్య ఎంపికయ్యారు. ప్రభాత్ సాయి, చార్వి ఫల్గుణి, వైష్ణవి సూర్య ఇంటర్, సిరి పావని, తన్యశ్రీ హైస్కూల్ విద్యను అభ్యసిస్తున్నారు. విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ –19 బాలుర విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రభాత్ సాయి ద్వితీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. చెన్నైలో జరిగిన ఆలిండియా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన బాలికలు 19వ జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు.

గౌతమి టెన్నిస్ అకాడమీలో శిక్షణ

ఈ క్రీడాకారులందరూ గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు. అకాడమీ కోచ్‌లైన వీటీవీ సుబ్బారావు, పి.వేణు గోపాలరావు వద్ద మెలకువలు నేర్చుకుంటున్నారు. ఈ అకాడమీలో ప్రతి బ్యాచ్‌కు 30 మందికి శిక్షణ ఇస్తున్నారు. అసోసియేషన్‌కు అధ్యక్ష, కార్యదర్శులుగా జేవీవీ అప్పారెడ్డి, సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. నగరానికి చెందిన వి.భాస్కరరామ్ టీటీఎఫ్ఐ ఉపాధ్యక్షులుగా ఉన్నారు.

ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతో..

విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్లే ఫీట్ టీం ఆధ్వర్యంలో 2023 ప్రీమియర్ లీగ్ పోటీల్లో ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులను ఆరు గ్రూప్‌లుగా విభజించి ప్రతి గ్రూప్‌లో ఏడుగురు సభ్యులు ఉండేలా టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆరు గ్రూప్‌ల మధ్య టేబుల్ టెన్నిస్–2023 ప్రీమియర్ లీగ్‌లో ఎస్ఎంఎస్ డెంటల్ గ్రూప్ విజయం సాధించింది. ఈ గ్రూప్‌లో నగరానికి చెందిన ప్రభాత్ సాయి ప్రతిభ కనబరిచి అవార్డును అందుకున్నాడు.

నాన్న ప్రోత్సాహం



నాన్న తీగిరెడ్డి బాపిరాజు ప్రోత్సాహంతో టేబుల్ టెన్నిస్‌లో అడుగు పెట్టాను. 8 ఏళ్ల వయసు నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించాను. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాను. ఆటతో పాటు చదువును ఆస్వాదిస్తున్నాను. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపే ధ్యేయంగా అడుగులు వేస్తున్నాను.

– ప్రభాత్ సాయి

ఆసక్తి పెరిగింది



గతంతో పోలిస్తే ఇప్పుడు టేబుల్ టెన్నిస్‌పై యువత ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా బాలురతో పాటు బాలికలుసైతం ఈ ఆటలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించడం ఆనందంగా ఉంది. మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను.

– సుబ్బారావు, కోచ్

కెనరా బ్యాంక్ అభివృద్ధికి మరింత కృషి



సమావేశంలో పాల్గొన్న రవివర్మ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కెనరా బ్యాంక్ అభివృద్ధికి మరింత కృషి చేయాలని విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ పి.రవివర్మ పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక రివర్‌బే హోటల్‌లో కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ 10వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరి సహకారంతో ప్రభుత్వరంగ బ్యాంకులలో కెనరా బ్యాంకు 3వ స్థానంలో నిలిచిందన్నారు. సీబీఈయూ అఖిల భారత నాయకుడు కె.శ్రీకృష్ణ మాట్లాడుతూ కెనరాబ్యాంక్‌లో సత్వరమే తగినన్ని నియామకాలు చేపట్టాలన్నారు. దశాబ్ద కాలంగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఔట్‌సోర్సింగ్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఏఐబీఈఏ కార్యదర్శి బీఎస్ రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యూవీఎస్ఎస్ హరివర్మ, సీబీఈయూ అఖిల భారత నాయకులు ఎంఎస్ శ్రీనివాసన్, బి.రాంప్రకాష్, ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) బీఎస్ రాంబాబు పాల్గొన్నారు.

కిమ్స్ బొల్లినేనిలో ముగిసిన వర్క్‌షాప్



లైవ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న గుండెవ్యాధి నిపుణులు

కంబాలచెరువు: కిమ్స్ బొల్లినేని హస్పిటల్ రెండు రోజులుగా నిర్వహిస్తున్న పీబీఎంవీ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన గుండెవ్యాధి నిపుణులు, సీనియర్ సర్జన్లు శస్త్రచికిత్సలో పలు కీలక అంశాలకు సంబంధించి మాట్లాడారు. పెర్క్యుటనస్ బెలూన్ మైట్రస్ వాల్వోప్లాస్టీ సంబంధించి రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేనిలో రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జరుగుతున్న చికిత్స విధానానికి సంబంధించి ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామరాజు మెలకువలను వివరించారు. వర్క్‌షాప్‌లో 90 మందికి పైగా కార్డియాలజిస్టు మైట్రల్ వాల్వ్‌లో ప్లాస్టీ తర్ఫీదు పొందారు. కోర్స్ డైరెక్టర్ డాక్టర్ రామరాజు, డాక్టర్ ఆర్‌కే జైన్, డాక్టర్ సి.రఘు, డాక్టర్ పీవీఎస్ఎం.కుమార్, డాక్టర్ సుజాత, డాక్టర్ పీకే దాస్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్య నిపుణులను బొల్లినేని అధినేత డాక్టర్ భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహనరావు అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి బైపాస్ సర్జరీ నిపుణులైన డాక్టర్లు సతీష్, ఏకే.శివప్రసాద్, కొల్లూరు లక్ష్మణ్, ఎం.ఫణితేజ, యు.రేవంత్ పాల్గొన్నారు.

గాడ్‌ఫాదర్ పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో జక్కంపూడి విజయలక్ష్మి, డాక్టర్ కర్రి రామారెడ్డి

ప్రకాశం నగర్: ఫాదర్స్‌డే సందర్భంగా సహాయ్ టివెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో గాడ్‌ఫాదర్ పురస్కారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ప్రముఖ మానసిక వైద్యులు కర్రి రామారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సామాజికవేత్తలు దేశిరెడ్డి బలరాం నాయుడు, లంక సత్యనారాయణ, కేఎల్ నరసింహరెడ్డి, డి.ప్రసాదరావు, మహ్మద్ మూసా, జీవీ రాంగోపాల్‌ను గాడ్ ఫాదర్ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో తండ్రి బాధ్యత, ఆయన కష్టం, త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ఎస్.కృష్ణారావు అధ్యక్షత వహించగా, మాదిరాజు శ్రీనివాస్, దుర్వాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బైబిల్ మిషన్ మందిరంలో ఫాదర్స్‌డే వేడుకలు

బైబిల్ మిషన్ మందిరాల్లో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం బైబిల్ మిషన్ కెథెడ్రల్ మందిరం, గోల్డెన్ జ్యూబ్లీ మందిరం, బైబిల్ మిషన్ స్వస్థత శాలలో ఆదివారం ఫాదర్స్ డే కార్యక్రమాలను నిర్వహించారు. బిషప్ డా.ఎస్.విజయరాజు ఆధ్వర్యంలో సంఘ విశ్వాసులు తమ తండ్రులను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విజయరాజుకు ఆయన కుమారులు ఎస్.సిమ్యోన్ సుదర్శన్, విలియం బెంటిక్‌తో పాటు ఆత్మీయ తండ్రిగా భావించి సంఘ విశ్వాసులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు పూర్వ సభ్యుడు రౌతు సూర్యప్రకాశరావు అధికారంలో ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన గోదావరి స్విమ్మర్స్ క్లబ్ ఇప్పుడు ఎంతోమందికి మేలు చేస్తోందని పలువురు అభినందించారు. ఆదివారం రౌతు సూర్యప్రకాశరావు పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. పుష్కర ఘాట్ వద్ద గోదావరి స్విమ్మర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు జరిపారు. క్లబ్ అధ్యక్షుడు గుబ్బల వెంకటరమణ, కార్యదర్శి పాలపర్తి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. రౌతుసేన ఆధ్వర్యంలో స్థానిక రౌతు కల్యాణమండపంలో రౌతు సూర్యప్రకాశరావు చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. స్విమ్మర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ధవళేశ్వరం పలుకు స్వచ్ఛంద సంస్థలో వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ నగర అధ్యక్షుడు పెదిరెడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, కోడి ప్రవీణ్, పంతం కొండలరావు, అల్లు బాబీ, వాకచర్ల కృష్ణ, పాలిక శ్రీను, సంకిస భవానీప్రియ పాల్గొన్నారు.

వాంబే కాలనీలో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలకసంస్థ 16వ డివిజన్ ఎండోమెంట్ వాంబే కాలనీలో ఆదివారం వైఎస్సార్ సీపీ నగర బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ మజ్జి నూకరత్నం, నాయుడు, గౌరీ, ప్రసాద్, కోటి పాల్గొన్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా డేవిడ్‌రాజు



డేవిడ్‌రాజుకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా అనపర్తికి చెందిన పాదూరి డేవిడ్‌రాజును నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీచేశారు. సదరు ఉత్తర్వుల ప్రతిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం డేవిడ్‌రాజుకు అందజేశారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కమిటీ సభ్యులుగా జిల్లా పరిధిలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా ఎస్పీ వ్యవహరించే ఈ కమిటీలో నాన్ అఫీషియల్ కమిటీ సభ్యుడిగా డేవిడ్‌రాజు రెండు సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగుతారని ఎమ్మెల్యే తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యేకు పాదూరి డేవిడ్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు. డేవిడ్‌రాజును ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కొమరిపాలెం, పాలమూరు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్లు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సత్తి సూరారెడ్డి తదితరులు అభినందించారు.

మదనగోపాలస్వామికి మండలాభిషేకం



అనపర్తి: మండలంలోని పొలమూరులో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదనగోపాలస్వామికి ఆదివారం మండలాభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పునఃనిర్మించిన ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగి మండల కాలం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతికి చెందిన వేదపండితులు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం జరిపించారు. పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులతో పాటు జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి పాల్గొన్నారు.

వర్షంతో ఆరుతడి పంటలకు ఊపిరి



ఈలకొలనులో మొక్కజొన్న తోట

రంగంపేట: వేసవి ఉష్ణోగ్రతలతో సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ఆరుతడి పటలకు ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షం ఊపిరి పోసింది. వర్షం ప్రభావంతో మెట్ట ప్రాంతం ముద్దయ్యింది. దీంతో అరుతడిగా సాగయ్యే ఉద్యాన పంటలైన కూరగాయలు, మిరప, మొక్కజొన్న, పామాయిల్, పండ్ల తోటలకు నీరందిందని రైతులు చెబుతున్నారు. వర్షం కారణంగా రంగంపేట, వడిశలేరు, కోటపాడు, సింగంపల్లి, మర్రిపూడి, నల్లమిల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న ఉద్యానవన పంటలు ఊపిరి పోసుకున్నాయని రైతులంటున్నారు. వర్షం కారణంగా మెట్టప్రాంత రైతులకు ఎంతో మేలు జరిగిందని ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: రాజవొమ్మంగిలోని అల్లూరి సీతారామరాజు హైస్కూల్లో 1987 –88 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం రాజమహేంద్రవరంలోని హోటల్ ఆనంద్ రీజెన్సీలో కలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకుని సందడి చేశారు. అప్పటి ఉపాధ్యాయులు టీవీ శర్మ, అంబటి వీరభద్రరావు, ఒకేషనల్ టీచర్ డాక్టర్ శామ్యూల్ కూడా హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు ఆర్.సోమశేఖర్, కృష్ణారావు, కె.కిరణ్ కుమార్, మఠం అమ్మాజీ, అరుణ లత తదితరులు తమ గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను, తెలుగు గ్రేడ్ వన్ పండిట్ కుమారుడు భీమశంకరం దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో కె.ఉమా మహేశ్వరరావు, చెప్పా శివరామకృష్ణ, వక్కలంక రామకృష్ణ, గొట్టుముక్కల రోజా, అడ్డూరి కరుణ, భూలక్ష్మి పాల్గొన్నారు.

వనువులమ్మ తీర్థం

కడియం: మండల కేంద్రమైన కడియం గ్రామదేవత వనువులమ్మ తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైద్యశిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ తేజో ఫణీంద్ర

సీతానగరం: ఉండేశ్వరపురం గ్రామ సచివాలయంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ మాకాల ఈశ్వరరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరం వేదస్పైన్ సెంటర్ వైద్యులు తేజో ఫణీంద్ర సుమారు 146 మందికి వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వెన్నుముక వంకర్లు, వెన్నుముక క్యాన్సర్, స్పాండైటిస్, మెడనొప్పి, నడుము నొప్పి, తిమ్మిర్లు, డిస్క్ సమస్యలు తదితర వాటికి చికిత్స చేశారు. సర్పంచ్ ఈశ్వరరావు, ఎంపీటీసీ మట్టా వెంకట రమణ మాట్లాడుతూ గ్రామాల్లో ఇటువంటి ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం పేద ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో రాధాస్వామి, రాజు, ఆసుపత్రి సిబ్బంది కుమారి, స్వర్ణ, లోకేష్, సతీష్, స్థానికులు నరిశెట్టి శివ, పాలిసెట్టి సత్తిబాబు, మన్నే నాగరాజు, మట్ట దుర్గారావు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న బాలుడిపై కేసు

సీతానగరం: ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇనుగంటివారిపేటలో స్నేహితుల వద్దకు కొవ్వూరు మండలం మద్దూరుకు చెందిన బాలుడు తరచూ వస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలో బాలికను ప్రేమించాలని వేధిస్తున్నాడు. శనివారం కూడా ఇనుగంటివారిపేట వచ్చాడు. అమ్మమ్మ ఇంటికి వెళుతున్న బాలిక నోరు, గొంతు నొక్కి పాడుపడిన భవనంలోకి తీసుకువెళ్లి తలను గోడకేసి కొట్టాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బ్లేడ్ తీయగా బాలిక భయంతో కేకలు వేసింది. దీంతో బాలుడు పారిపోయాడు. బాలిక ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ఎంఈఓ–2గా జ్యోతి ప్రసాద్



రాజానగరం: మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)– 2గా జీజేవీవీఎస్ఎస్ జ్యోతిప్రసాద్ నియమితులయ్యారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరును తరచూ పర్యవేక్షిస్తూ, మెరుగైన ఫలితాలను సాధించడం, ఆయా మండలాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించడానికి మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించాలని ప్రభుత్వం భావించిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో కాకినాడలో నిర్వహించిన ఎంఈఓ –2 కౌన్సెలింగ్ ద్వారా జ్యోతిప్రసాద్ రాజానగరం మండలానికి వచ్చారు. గతంలో ఆయన ఇదే మండలంలో ఎంఈఓగా పనిచేశారు. అనంతరం పుణ్యక్షేత్రం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన వెబ్ కౌన్సెలింగ్‌లో కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు.

నేడు ముగ్గళ్లలో గడప గడపకూ..

రాజానగరం: సీతానగరం మండలం ముగ్గళ్లలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుంది. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొంటారు.